దివ్యాంగుల రుణాల యూనిట్లను పెంచాలి



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

చాదర్‌ఘాట్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు మంజూరు చేసిన రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. సోమవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ.. ప్రతి మండలం, మున్సిపల్ పట్టణానికి ఒకొక్క యూనిట్ మాత్రమే మంజూరు చేసిందని దీంతో నిరుద్యోగ వికలాంగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి మండలానికి 25 యూనిట్లు పెంచి యూనిట్‌కు రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలన్నారు. అనంతరం కార్యాలయంలో ఫిజికల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌గా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధి శ్రీరమణ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆమె కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీరమణకాలనీలో మిగిలిన రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మార్చేందుకు త్వరలోనే నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, కాంతారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కసిరెడ్డి దశరథ రామిరెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాము, మమతా మల్లేశ్‌గౌడ్, మురళి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగీతం ఆరోగ్యానికి ఔషధం లాంటిది



రామును సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: సంగీతం ఆరోగ్యానికి ఔషధం లాంటిదని ప్రముఖ కవి, రసమయి అధ్యక్షులు డాక్టర్ ఎంకే. రాము అన్నారు. ఘంటసాల వెంకటేశ్వర రావు 102వ జయంతి సందర్భంగా స్వరఝరి కల్చరల్ అసోసియేషన్, డాక్టర్ కొమర్రాజు వేంకట జ్ఞానకుమార్ ఆధ్వర్యంలో న్యూ నాగోలు కాలనీలో సోమవారం నిర్విరామ 51 ఘంటసాల మాస్టారి సినీ గీతాల స్వర నీరాజనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాము మాట్లాడుతూ.. ఎవ్వైన నిబద్ధతతో నేర్చుకుంటే ఎవరైనా గొప్ప గాయకులూ కావొచ్చన్నారు. ఘంటసాల మాష్టారు కూడా ఏ పాటైనా పాడేటప్పుడు ఆ సాహిత్యం, సన్నివేశాన్ని ఆకళింపు చేసుకున్న తర్వాతే దానికి తగ్గ స్వరంతో పాడేవారన్నారు. ఈ కార్యక్రమంలో డా.జి.శ్యామల, నూకల ప్రభాకర్, తాతా హనుమంతరావు, విజయలక్ష్మి, రామలక్ష్మి, హిరణ్‌బాల పాల్గొన్నారు.



కాలనీలు, బస్తీవాసుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్కులపై పర్యవేక్షణ కరువై కళావిహీనంగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ఉదయం సాయంత్రం సేదతీరేందుకు పార్కులకు వెళ్దామంటే ఎలాంటి సౌకర్యాలు లేక, ముళ్ల చెట్లు, మద్యం బాటిళ్లు పడి ఉంటున్నాయి. సంబంధిత అధికారులు పార్కులపై దృష్టి సారించకపోవడంతోనే ఆహ్లాదనిచ్చే పార్కులు నిరుపయోగంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. –హస్తినాపురం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా పార్కులు
- అసౌకర్యానికి గురవుతున్న స్థానికులు
- దృష్టి సారించని అధికారులు

ఆకతాయిలకు నెలవై

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం, లింగోజిగూడ, వనస్థలిపురం, చంపాపేట తదితర ప్రాంతాల్లోని పార్కుల్లో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని తాగిన మైకంలో రాత్రివేళల్లో యువకులు గొడవలకు దిగుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వనస్థలిపురం సుష్మా థియేటర్ వెళ్లే రోడ్డులో ఉన్న ప్లేగ్రౌండ్‌లో సాయంత్రం అయిందంటే చాలు ఆకతాయిలు రెచ్చిపోతుంటారు. సాయంత్రం మొదలుకొని అర్ధరాత్రి వరకు మద్యం తాగుతూ నానా హంగామా సృష్టిస్తుంటారని స్థానికులు వాపోతున్నారు. అంతేకాక కొంతమంది యువకులు గంజాయి తాగుతూ భయాందోళనకు గురి చేస్తున్నారు.

అర్ధరాత్రి వరకు చిందులు..

రాత్రి వేళల్లో తాగిన మైకంలో చుట్టుపక్కల ఇళ్లముందు పార్కుచేసిన ద్విచక్రవాహనాల్లోని పెట్రోలు తీస్తున్నారని ఆయా కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. పార్కుల్లో తాగి పడేసిన మద్యం బాటిళ్ల వల్ల ఉదయం మార్నింగ్ వాక్‌కు వచ్చిన వారు అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని బాటిళ్లు పగిలిపోయి కాళ్లలో గుచ్చుకుంటున్నాయని పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో మద్యం తాగుతూ పెద్ద పెద్ద శబ్దాలు చేస్తుండటంతో సమీపంలోని ఇళ్లలోకి వారి శబ్దాలు వస్తుండటంతో చిన్న పిల్లలు భయాందోళనకు గురవుతున్నారని ఉన్నతాధికారులు స్పందించి పార్కులపై నిరంతరం నిఘా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతా వారు కోరుతున్నారు.

పోలీసులు నిఘా పెంచాలి



పార్కులు మందుబాబుల అడ్డాలుగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఉదయం మార్నింగ్ వాక్ చేస్తున్నప్పుడు మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. పార్కులో రాత్రి 8 తర్వాత వెళ్లిపోవాలని పలుమార్లు విన్నవించిన వినడం లేదు. కొందరు తాగిన మైకంలో గొడవలకు దిగుతున్నారు. రాత్రి సమయంలో ఇళ్లముందు పార్కుచేసిన వాహనాల్లోని పెట్రోల్ దొంగిలిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలి.

–బద్దం రాంరెడ్డి, క్రాంతిహిల్స్‌కాలనీ అధ్యక్షుడు

దాడులకు పాల్పడుతున్నారు



పార్కులలో మద్యం, గంజాయి తాగిన మైకంలో యువకులు పార్కులలోకి వచ్చే వారిపై దాడులకు పాల్పడుతున్నారు. పక్కకాలనీల వారు కాకుండా ఎక్కడి నుంచో వస్తున్న యువకులు రాత్రి ఎనిమిది గంటల నుండి అర్ధరాత్రి వరకు మద్యం, గంజాయి తాగుతూ పార్కుల్లో చిందులేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. మందుబాబుల ఆగడాలపై పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత పెంచాల్సిన అవసరం ఉంది.

–వంగూరి చంద్రశేఖర్ యాదవ్

పార్కులపై నిఘా పెంచుతాం



వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ఆయా పార్కులపై ప్రత్యేక నిఘా ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటాం. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలి. పార్కుల్లో ఎవరైనా ఎనిమిది దాటిందంటే బయటకు వెళ్లిపోవాలి. పార్కులపై నిఘాపెంచి, పోలీస్ పెట్రోలింగ్ పెంచుతాం.

–సీహెచ్ శ్రీనివాస్, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్

చంద్రపురికాలనీలో చైన్ స్నాచింగ్

నాగోలు: ఇంటి ముందు కూర్చున్న ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నకిరేకల్ కాసన్నగోడుకు చెందిన బుర్రి రుక్మిణమ్మ(86), చంద్రపురికాలనీలో ఉంటున్న తన కుమారుడి ఇంటి ముందు కూర్చొని ఉంది. గుర్తు తెలియని ఓ దుండగుడు వచ్చి రుక్మిణమ్మ మెడలోని 1.5తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వాలి



లోగోను ఆవిష్కరిస్తున్న డా.జయప్రకాష్ నారాయణ

మన్సూరాబాద్: కార్పొరేట్ ఆస్పత్రులు సామాజిక బాధ్యతగా సీపీఆర్‌పై శిక్షణ ఇస్తే ప్రతి ఇంట్లో ఒక సీపీఆర్ వలంటీర్ ఉంటాడని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్‌నారాయణ సూచించారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఎటీఎం వద్ద సోమవారం కోడ్ బ్లూ సీపీఆర్ లోగోను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. 90 శాతం మందికి హృదయ శ్వాసకోశ పునరుజ్జీవం సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రిసస్‌టేషన్) ఎలా చేయాలో తెలియదన్నారు. గుండెపోటు వచ్చిన వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన లేనప్పుడు సీపీఆర్ చేస్తే చలనం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. కోడ్ బ్లూ పేరుతో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని రైస్ ఎటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రిషా నిర్వాహకురాలు యశస్విని జొన్నలగడ్డ, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే!



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నం–1 లోని జ్ఞాన సరస్వతి దేవాలయ స్థాపించి పుష్కరకాలం అయినా సందర్భంగా దేవాలయంలో పుష్కర కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, నాయకులు అరవింద్ శర్మ, నగేష్, శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల శేఖర్ కొండ శ్రీనివాస్ సాజిద్, శ్యామ్‌గుప్తా, నవీన్ గౌడ్, ఊర్మిల రెడ్డి, స్వప్న,అనురాధ, ప్రభాకర్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు ఆలయాలు, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ సరస్వతి మాతకు పూజలు నిర్వహించారు. విద్యావేత్త కృష్ణారెడ్డి చేతుల మీదుగా 30 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు వేదపండితులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లలితారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సింహా, వినయ్‌కుమార్, అవీనా, అనిత, గీతాంజలి పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ ఆలయంలో..

కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ సరస్వతి మాత ఆలయంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అక్షరాభ్యాసానికి హాజరైన చిన్నారులకు పలకలు, పూజ సామగ్రి, నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ లావణ్య, అర్చకులు ప్రవీణ్‌శర్మ, అంబ ప్రసాదు, సంతోష్ శర్మ పాల్గొన్నారు.

బన్సల్ క్లాస్ కాలేజీలో..

మలక్‌పేట: పండుగలు, ఉత్సవాల విశిష్టతను చాటి చెప్పాలని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ శివశంకర్‌శాస్త్రి అన్నారు. మూసారంబాగ్‌లోని బన్సల్ క్లాస్ కాలేజీలో జరిగిన వసంత పంచమి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నలగోని రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఒత్తిడి లేకుండా విద్య అందించడం ద్వారా ఆసక్తి పెరుగుతుందన్నారు. జీఎమ్ మామిడి నరేష్‌రెడ్డి, ఏజీఎం విశేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న లెక్కల కృష్ణారెడ్డి

తక్షశిల హై స్కూల్‌లో..

నాగోలు: ఎల్‌బీనగర్‌లోని తక్షశిల హై స్కూల్‌లో సోమవారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సరస్వతి పూజ, విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

మాతృశ్రీ కాలనీలో..

సైదాబాద్: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పండుగలు, ఉత్సవాల విశేషాలను వివరించాలని శ్రీవిజ్ఞానవర్ధిని ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వీరేంద్ర బాబు యాదవ్ అన్నారు. సోమవారం వసంత పంచమి పురస్కరించుకొని సైదాబాద్ మాతృశ్రీ కాలనీలోని పాఠశాలలో ప్రత్యేక హోమం నిర్వహించారు. విద్యార్థులు సరస్వతిదేవి చిత్రపటం వద్ద పుస్తకాలు, పెన్నులు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హోమంలో పాల్గొన్న వీరేంద్రబాబు యాదవ్



ధ్యానాంజనేయ ఆలయంలో..



శివశంకర్ శాస్త్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు



తక్షశిల హైస్కూల్‌లో ప్రత్యేక పూజలు



చిన్నారులకు పలకలను అందజేస్తున్న నల్లా రఘుమారెడ్డి

రైతు బజార్లలో దళారీ వ్యవస్థను నిర్మూలిస్తాం



రైతులతో మాట్లాడుతున్న మధుసూదర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రైతు బజార్లలో దళారీ వ్యవస్థకు ప్రమేయం లేదని, స్టాల్స్ ఉన్న రైతులు పండించిన పంటను నేరుగా రైతుబజార్లలో వినియోగదారులకు అధికారులు సూచించిన ధరలకు అమ్మి నాణ్యమైన కూరగాయలను ఇవ్వాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన గడ్డిఅన్నారం పాలకవర్గం సభ్యులు, అధికారులతో కలిసి కొత్తపేటలోని రైతుబజార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తపేట రైతు బజార్ ఎదురుగా రైతులకు నష్టం కలిగేలా సాయంత్రం కొంత మంది దళారులు అమ్ముతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. రైతు బజార్లలో ధరల పట్టిక ప్రకారం అమ్మాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, సభ్యులు బండి మధుసూదన్‌రావు, పన్యాల జైపాల్ రెడ్డి,మెగావత్ గణేష్ నాయక్, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి,దోమలపల్లి అంజయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్యాధునిక చికిత్సతో కేన్సర్‌ను నివారించవచ్చు



మాట్లాడుతున్న డా. గాయత్రి

మన్సూరాబాద్: కేన్సర్ భయంకరమైన వ్యాధి అనే భయం ఉండొద్దని, అత్యాధునిక చికిత్స పద్ధతులతో కేన్సర్‌ను నయం చేయవచ్చని కామినేని హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ గాయత్రి అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రాక్‌టౌన్ కాలనీలోని జీడీ గోయెంకా స్కూల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన డ్రోన్ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ.. కేన్సర్ చికిత్సకు ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, పాఠశాల డైరెక్టర్ నివేదితా శివకుమార్, ప్రిన్సిపాల్ జగదీశ్వరీ నటరాజన్ పాల్గొన్నారు.

కాలనీల్లో కార్పొరేటర్ పర్యటన



అధికారులతో చర్చిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ, శానిటేషన్, వీధిలైట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. క్రిస్టియన్ కాలనీలో కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కేఎల్‌ఆర్‌పై దురుసుగా మాట్లాడటం సరికాదు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డిపై దురుసుగా మాట్లాడటం ఎమ్మెల్యే సబితారెడ్డికి తగదని బడంగ్‌పేట కంటెస్టెడ్ కార్పొరేటర్, 24వ డివిజన్ ఇన్‌చార్జి నవారు మల్లారెడ్డి అన్నారు. సోమ వారం అల్మాస్‌గూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గౌరవ మాజీ ఎమ్మెల్యేను విమర్శించే హక్కు ఎమ్మెల్యేకు లేదని ఆగ్రహం వ్య క్తం చేశారు.ఎవరు నిధులు తెచ్చినా డివిజన్ల అభివృద్ధికే అనే సంగతి మరిచి ఆమె మాట్లాడుతున్నా రని విమర్శించారు. జీవోల పేరుతో కాలనీవాసులను మోసం చేశారన్నారు. ఐదు సంవత్సరాలు మంత్రి గా ఉండి ఎంత అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.చెరువుల కబ్జాలు, అనుచరుల అవినీతి బాగోతాలు అందరికీ తెలిసినవే నన్నారు.అవినీతి పాలనను చూసి ప్రజలకు విసుగొచ్చి కాంగ్రెస్ పార్టీని ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్ ఉన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.11, క్యారెట్ రూ.19, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.21, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.40, మునగ రూ.75, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.19, కీర రూ.28, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

'లక్ష డప్పులు.. వేల గొంతులు'ను జయప్రదం చేయాలి



బట్టు దాసురావు

మలక్‌పేట: లక్ష డప్పులు వేల గొంతులును జయప్రదం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) మలక్‌పేటలో భారీ డప్పుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు మాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న అధ్యక్షతన ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు మూసారంబాగ్ శాలివాహన నగర్ పార్కు నుంచి ప్రారంభమై ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, ఫ్రెండ్స్‌కాలనీ, మూసీనది సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం, ఈస్ట్‌జోన్ ఆర్టీవో ఆఫీస్ మీదుగా టీవీ టవర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో పాడైన డ్రైనేజీ లైన్లు కొత్తవి ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యలపై నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సోమవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని రామాంజనేయులు కాలనీ, నరసింహస్వామి కాలనీ ఫేస్–2, సాయి సప్తగిరి కాలనీ, శ్రీనివాస కాలనీ, మరిన్ని కాలనీలకు డ్రైనేజీ లైన్ మంజూరు చేయాలన్నారు. కొన్ని కాలనీల్లో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నూతనంగా పైపులైన్ మంజూరు చేయాలని వినతిలో కోరారు.

సందేశాత్మక చిత్రాలు తీయాలి



ఆర్పీ పట్నాయక్‌ను సత్కరించిన శివకుమార్‌గౌడ్

సైదాబాద్: సమాజహితం కోసం సందేశాత్మక చిత్రాలను తీయాలని చంచల్‌గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయనను సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కలిశారు. ఇటీవల ఆర్పీ దర్శకత్వం వహించిన కాఫీ విత్ ఎ కిల్లర్ సినిమాకు ప్రశంసలు రావడంతో ఆర్పీని శివకుమార్‌గౌడ్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సినిమాలు ప్రజలను ఆలోచించే విధంగా, మంచి మార్పుల కోసం దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, గౌతమ్ పట్నాయక్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

చాదర్‌ఘాట్: ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు అందాయని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేటలో అక్రమ కట్టడాలపై, అజంపురాలో రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదులు వచ్చాయని సంబంధిత అధికారులతో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

తగ్గిన మిర్చి ధర

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం మార్కెట్‌కు దాదాపు 5000 బస్తాల మిర్చి గద్వాల్, నాగర్ కర్నూల్ నుంచి దిగుమతి అయింది. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 24,000 పలికిందని ఇప్పుడు ఒక్కసారిగా 10 వేలకు తగ్గడంతో నష్టాల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం మార్కెట్‌కు వచ్చిన మొదటి రకం మిర్చి క్వింటాల్‌కు రూ. 12,500 కాగా రెండోరకం రూ. 10,000 ధర పలికినట్లు అధికారులు తెలిపారు.

నిల్వ ఉంచడమే కారణం..

గతేడాది కొంతమంది వ్యాపారులు ధరలు ఎక్కువగా ఉంటాయనే ఉద్దేశంతో క్వింటాళ్ల కొద్ది కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వలు చేశారు. ధరలు తగ్గదలతో స్టోరేజ్‌లో ఉన్న మిర్చిని ఇప్పుడు మార్కెట్‌కు తీసుకురావడం, బయట జిల్లాల నుంచి కొత్త పంట రావటంతో మిర్చితో మార్కెట్ కళకళలాడుతుంది. అదే విధంగా మిర్చి ఎక్స్‌పోర్ట్ లేకపోవడం ధర తగ్గుదలకు కారణమని వ్యాపారులు తెలిపారు. ఇప్పుడు వస్తున్న మిర్చికి కొంతమేర మచ్చలు రావటంతో ధర తగ్గుదలకు కారణమని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు.